# టీ-20 క్రికెట్ విజేత మహారాష్ట్ర

## విజేతలకు బహుమతులు అందజేసిన చైర్మన్ డా.కూరపాటి ప్రదీప్‌కుమార్









**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

మే నెల 30వ తేదీనుండి జూన్ 06వ తేదీ వరకూ జరిగిన టీ-20 మహిళా క్రికెట్ టైటిల్‌ను మహారాష్ట్ర జట్టు దక్కించుకుంది. ఖమ్మంస్టేడియంలో మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టుపై మహారాష్ట్ర జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఉత్తరాఖండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 87 పరుగులు సాధించింది. జట్టులోని సాక్షి 26, గోల్డి 24, నందిని 17 పరుగులు జోడించారు. తర్వాత 88పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మహారాష్ట్ర జట్టు అయిదు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్‌గా భారత మహిళా క్రికెట్ జట్టు క్రీడాకారిణి కిరణ్‌ప్రభ దిగినప్పటికీ ఎక్కువ సేపు క్రీజులో నిలదొక్కుకోలేక పోయి తొలి బంతికే వెనుదిరిగింది. అదే క్రమంలో వెంటనే మరో వికెట్ కూడా పడింది. దీంతో 2 పరుగులకు రెండు కీలకమైన వికెట్లు కోల్పోయిన మహారాష్ట్ర ఇన్నింగును అనీష బిక్కడ ఒంటరి పోరాటం చేసి 41 పరుగులు జోడించి జట్టు విజయానికి తోడ్పడింది. మ్యాచ్ అనంతరం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ టీ20క్రికెట్ అసోసియేషన్, యువం చైర్మన్ డా.కూరపాటి ప్రదీప్‌కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విమెన్స్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎండీ మతిన్, సందీప్ ఆర్య, సాంబమూర్తి, ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ క్రికెటర్లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

**అట్టహాసంగా ముగిసిన విమెన్స్ టీ 20 క్రికెట్ లీగ్...**

ఖమ్మం గుమ్మంలో మరో అతిపెద్ద మహిళా క్రికెట్ లీగ్ మంగళవారం రాత్రి జరిగిన ముగింపు వేడుకలు ఆకట్టుకున్నాయి. వరుసగా ఆరోసారి మహిళా క్రికెట్ లీగ్ పోటీలకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం వేదికై ఉమ్మడి జిల్లా క్రికెట్ ప్రేమికులను అలరించింది. తెలంగాణ విమెన్స్ టీ20 క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ డా.కూరపాటి ప్రదీప్‌కుమార్ సారధ్యంలో నిర్వహించిన ఈ మెగాటోర్నీకి మొత్తం 12 రాష్ట్రాలనుండి మహిళా క్రికెటర్లు పాల్గొన్నారు. పూర్తిగా ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో తళుకులీనే క్రికెట్ పోటీలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, తెలంగాణ విమెన్ టీ.20క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ డా.కూరపాటి ప్రదీప్ కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై క్రికెట్ పోటీలను మే 30న ఘనంగా ప్రారంభించారు.




**12రాష్ట్రాల నుండి తరలివచ్చిన మహిళా క్రికెటర్లు...**

ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం వేదికగా జరిగిన ఈ పోటీలకు తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, పశ్చిమ బెంగాల్, దయ్యూ డామన్, మహారాష్ట్ర, గుజరాత్, బీహార్, ఉత్తరప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు చెందిన సీనియర్ మహిళా క్రికెటర్లు, టీం మేనేజర్లు, టీం కోచ్‌లు తరలివచ్చారు. పోటీల్లో పాల్గొనే వారికి వసతి, భోజన ఏర్పాట్లు, డ్రస్సులు యువం పౌండేషన్ చైర్మన్ డా.ప్రదీప్‌కుమార్ అందజేశారు.




# సేవకు దక్కిన సత్కారం

## బిలీఫ్ హాస్పిటల్ ఎండీ రమాజ్యోతికి ఉత్తమ పారిశ్రామిక వేత్త అవార్డు



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

ఒక మహిళాశక్తిగా పారిశ్రామిక, సేవా రంగాల్లో అంచలంచెలుగా ఎదుగుతూ పలువురు మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న ఖమ్మంలోని బిలీఫ్ హాస్పిటల్ ఎండీ మేడంపూడి రమాజ్యోతికి ఉత్తమ మహిళా పారిశ్రామిక వేత్త అవార్డు దక్కింది. మంగళవారం ఖమ్మం ఐటీ హబ్‌లో ఏర్పాటుచేసిన తెలంగాణ రాష్ట్ర అవవరణ దశాబ్ది ఉత్సవాల్లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధుసూదన్, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు, కలెక్టర్ వీపీ గౌతమ్, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ చేతుల మీదుగా రమాజ్యోతి ఉత్తమ మహిళా పారిశ్రామిక వేత్త అవార్డులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్ తదితరులు మాట్లాడుతూ...రమాజ్యోతి మహిళా పారిశ్రామిక వేత్తగా, పేదలకు సేవా కార్యక్రమాలు అందించడంలో మహిళా లోకానికి మార్గదర్శిగా నిలిచారని అందుకే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో సన్మానించుకుంటున్నామని అన్నారు. రాబోవు రోజుల్లో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి అద్భుతంగా కొనసాగుతుందని, దేశంలోనే తెలంగాణ ప్రత్యేక స్థానం కైవసం చేసుకుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఈ ఆర్థిక ఏడాది ముగింపు అంశాల్లో భాగంగా వెల్లడిస్తున్నాయని, దేశంలో జాతీయ స్థాయిలో జీడీపీ తగ్గుముకం పడుతున్న తరుణంలో తెలంగాణలో 2.2 శాతం వృద్ధిరేటు సాధ్యమైం దన్నారు. పెట్టుబడులకు కేరాఫ్‌గా మారిన తెలంగాణలో 2021-22లో 150శాతం వృద్ధి సాకార మవగా, 2020-21లో రూ. 31,274 కోట్ల పెట్టుబడులు తెలంగాణకు పరుగులు తీశాయన్నారు. 2021-22లో రూ.76,568 కోట్లు పెట్టుబడులు వచ్చి 3.71లక్షలుగా ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య 7లక్షలకు చేరుకుందని, 2014-15లో రాష్ట్ర ఐటీ ఎగుమతుల విలువ రూ. 66,276 కోట్లుగా ఉండగా, 2021-22 నాటికి రూ. 1,45,522 కోట్లకు చేరుకున్నదన్నారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ, తెలంగాణ, ఖమ్మం అభివృద్ధి చూసి గర్వపడాలన్నారు. సింగిల్ విండో ద్వారా అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మన రాష్ట్రం పారిశ్రామిక రంగంలో అద్భుత ప్రగతి సాధించిందన్నారు. అనంతరం ఉత్తమ పారిశ్రామిక వేత్తలకు ప్రసంశా పత్రాలు, మేమెంటోలు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వర రావు, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, పరిశ్రమల శాఖ జిఎం అజయ్ కుమార్, టి హబ్ కోఆర్డినేటర్ బత్తిని ప్రకాష్, వివిధ కంపెనీల సిఇఒ లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**రమాజ్యోతికి అభినందనల వెల్లువ..**

ఉత్తమ మహిళా పారిశ్రామిక వేత్తగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రత్యేక అవార్డు అందుకున్న ఎం.రమాజ్యోతికి జిల్లాలోని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. శాలువాలు, పూల బొకేలతో సత్కారం చేసి జిల్లాలో మరింతగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



